సాక్షి
అనకాపల్లి
శనివారం । 9 । సెప్టెంబర్ । 2023



'ఉట్టి'పడిన ఉత్సవం

కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా శుక్రవారం ఉపమాక వెంకన్న, సింహాద్రి అప్పన్న ఆలయాల్లో ఉట్ల సంబరం జరిపారు. IIలో



కనకమ్మ సన్నిధిలో

విశాఖ: దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ దంపతులు శుక్రవారం సిరులతల్లి కనకమహాలక్ష్మిని దర్శించుకున్నారు.

స్వల్ప వర్షసూచన

అనకాపల్లిటౌన్: రాగల ఐదురోజులు స్వల్ప వర్షసూచన ఉందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వాతావరణ శాస్త్రవేత్త ఎంబీజీఎస్ కుమారి శుక్రవారం తెలిపారు. ఈ నెల 9న 2, 10న 3, 11న 8, 12న 2న 13న 4 మి.మీ., 33 నుంచి 33.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయన్నారు.

న్యూస్‌రీల్

పోలీసు అధికారులకు ఉత్కృష్ట్ సేవా పతకం



ఎస్‌ఐ కుమారస్వామి

సాక్షి, అనకాపల్లి: ఉత్కృష్ట్ సేవా పతకానికి పలువురు పోలీసు అధికారులు ఎంపికయ్యారు. బుచ్చెయ్యపేట ఎస్‌ఐ కె.కుమారస్వామి, బక్కన్నపాలెం సీఐ సింగారపు రామకృష్ణ, అరకు సీఐ సీహెచ్ రుద్ర శేఖర్‌లను ఈ అవార్డుకు ఎంపిక చేస్తూ రాష్ట్ర డీజీపీ కె.వి.రాజేంద్రనాథ్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

యలమంచిలి మున్సిపల్ కమిషనర్ బాధ్యతల స్వీకరణ



మున్సిపల్ కమిషనర్ కొండలరావుకు అభినందనలు తెలుపుతున్న మున్సిపల్ అధికార్లు,సిబ్బంది

యలమంచిలి : స్థానిక మున్సిపల్ కమిషనర్‌గా కె.కొండలరావు శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. కొంతకాలంగా ఇక్కడ ఇన్‌చార్జి కమిషనర్‌గా పనిచేస్తున్న డీఈ కె.వీరయ్య నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది, మున్సిపల్ ఉద్యోగులు,సచివాలయ సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి, అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యలమంచిలి మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తానని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డీఈ వీరయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు,టౌన్‌ప్లానింగ్ అధికారి శ్రీలక్ష్మి, మున్సిపల్ మేనేజరు ప్రభాకరరావు, ఆర్వో నీలిమ, అన్నాజీ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో ఆరు మహిళా మార్టులు



షాపులను పరిశీలించి సిబ్బందితో మాట్లాడుతున్న పీడీ

మాకవరపాలెం: డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో జిల్లాలో ఆరు మహిళా మార్టులను ఏర్పాటు చేస్తున్నట్టు డీఆర్‌డీఏ లక్ష్మీపతి తెలిపారు. మాకవరపాలెంలో త్వరలో ప్రారంభించనున్న మహిళా మార్ట్ ఏర్పాటుకు గుర్తించిన షాపులను ఆయన శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. ఈ షాపులకు షెట్టర్లు అమర్చాల్సి ఉన్నందున వాటిని త్వరగా పూర్తి చేయించాలని యజమానికి సూచించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికే సబ్బవరం, మాడుగులలో మార్టులను ప్రారంభించామన్నారు. కొత్తగా మాకవరపాలెం, చోడవరం, అడ్డురోడ్డు, అనకాపల్లిలో ప్రారంభించనున్నట్టు చెప్పారు. రూ.40 లక్షలతో మాకవరపాలెంలో మార్టు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ నగదు అంతా డ్వాక్రా మహిళా సంఘాల షేర్ ధనంగా చెప్పారు. ఒక్కొక్క సభ్యురాలు రూ.250 ఇస్తున్నారన్నారు. రుణాలు పొందిన సభ్యులు తయారు చేసే వస్తువులను ఈ మార్టులో అమ్మకాలు చేస్తామన్నారు. ఆయన వెంట వెలుగు ఏపీఎం చినబాబు, సీసీలు ఉన్నారు.

డీఈవో కస్తూర్బా పాఠశాల తనిఖీ



విద్యార్థినుల నోట్ పుస్తకాలు పరిశీలిస్తున్న డీఈవో వెంకటలక్ష్మమ్మ

నాతవరం: ప్రభుత్వ నిబంధనల ప్రకారం విద్యార్థినులకు మెను అమలుతోపాటు విద్యాపరంగా అన్ని విధాలుగా సహకారం అందించాలని డీఈవో వెంకటలక్ష్మమ్మ అన్నారు. మర్రిపాలెంలో గల కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయను శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో ఏకాంతంగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారి నోట్ పుస్తకాలను పరిశీలించి ఈ ఏడాది ఉత్తీర్ణత నూరు శాతం ఉండాలని చెప్పారు. ఆమె వెంట ప్రిన్సిపాల్ భవాని ఉన్నారు.

చోడవరం అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సస్పెన్షన్!

చోడవరం రూరల్: స్థానిక అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా విధులు నిర్వహిస్తున్న సీనియర్ న్యాయవాది జి.హేమరూప సస్పెండ్ అయినట్టు తెలిసింది. విజయవాడలోని డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ కార్యాలయం శుక్రవారం రాత్రి ఈమేరకు ఉత్తర్వులు జారీ చేసినట్టు సమాచారం.

● ప్రజల వద్దకే జేకేసీ-స్పందన

చేరువగా.. మరింత వేగంగా..



హాజరైన అధికారులు

- మండల కేంద్రంలో తొలిసారిగా కలెక్టర్ నిర్వహణ
- నాతవరం స్పందనకు 178 వినతులు
- వీటిలో నాలుగు సమస్యలకు తక్షణ పరిష్కారం



నాతవరం స్పందన కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, చిత్రంలో జేసీ జాహ్నవి, అసిస్టెంట్ కలెక్టర్ స్మరణ్‌రాజ్, ఏఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా

సాక్షి, అనకాపల్లి: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా 'జగనన్నకు చెబుదాం' పేరుతో ప్రభుత్వం చేపడుతున్న అర్జీల స్వీకరణ కార్యక్రమం ప్రజలకు మరింత చేరువైంది. ప్రతి సోమవారం జిల్లా స్థాయి 'స్పందన' నిర్వహించే ప్రభుత్వం ఇప్పుడు మండల స్థాయి కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మారుమూల గ్రామీణ ప్రాంతాల ప్రజల సమస్యలను వారి వద్దకే వెళ్లి పరిష్కరించే విధంగా జిల్లాలో తొలిసారిగా మండల స్థాయి జేకేసీ ప్రజా స్పందన కార్యక్రమాన్ని శుక్రవారం నాతవరంలో ఏర్పాటు చేశారు. కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, జాయింట్ కలెక్టర్ జాహ్నవి, అసిస్టెంట్ కలెక్టర్ స్మరణ్‌రాజ్, నర్సీపట్నం అడిషనల్ ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా తోపాటు అన్ని విభాగాల జిల్లా అధికారులు హాజరయ్యారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమం మధ్యాహ్నం 2 గంటల వరకు సాగింది. జేకేసీ ప్రజా స్పందన కార్యక్రమానికి 178 వినతులు వచ్చాయి. వీటిలో 100 వరకు అర్జీలు భూతగాదాల పరిష్కారం, భూ పట్టాలు, ఇళ్ల పట్టాల మంజూరు మొదలైన అంశాలపై వచ్చాయి. తాగునీరు, సాగునీరు, దగ్గరలో వైద్య, పశు వైద్య సదుపాయాలు కావాలని మరికొన్ని వినతులు అందాయి. నర్సీపట్నంలో ఉన్న సాగునీటి ఇంజినీరింగ్ కార్యాలయాన్ని కొనసాగించాలని కోరుతూ స్థానిక ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, వైస్ ఎంపీపీ, సర్పంచులు వినతి పత్రం అందించారు. సంక్షేమ పథకాలకు సంబంధించిన నాలుగు అర్జీలను తక్షణమే పరిష్కరించారు. అర్జీలకు వెంటనే స్పందించాలని, పరిష్కారం సాధ్యం కాకపోతే కారణాలు వివరించాలని కలెక్టర్ ఆదేశించారు.

ఎప్పటికప్పుడు మార్పులు

ప్రజా విజ్ఞప్తుల స్వీకరణ కార్యక్రమంలో ప్రభుత్వం ఎప్పటికప్పుడు మార్పులు చేస్తోంది. ప్రజలకు మరింతగా అందుబాటులోకి తీసుకువచ్చేలా సంస్కరణలు చేపడుతోంది. కలెక్టర్ కార్యాలయంలో ప్రతీ సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించడంతోపాటు ఆర్డీవో, తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలు, గ్రామ సచివాలయాల్లో ఫిర్యాదులు స్వీకరిస్తున్నారు. ఫలితంగా ఏ గ్రామంలో నివసించే వారు అదే గ్రామ సచివాలయంలో తమ సమస్యను అధికారులకు విన్నవించే వెసులుబాటు కలిగింది. 'జగనన్నకు చెబుదాం' పేరుతో నేరుగా ఆన్‌లైన్‌లో ఫిర్యాదు నమోదు చేసే ప్రక్రియను ప్రవేశపెట్టారు. ఫిర్యాదు నేరుగా సీఎం కార్యాలయానికి చేరేలా ఆధునీకరించారు. సీఎంవో దృష్టిలో సమస్య ఉండటంతో త్వరితగతిన పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై పడింది. ఫలితంగా ప్రజలకు మరింత మేలు చేకూరింది.



వినతులు పరిశీలిస్తున్న కలెక్టర్, జేసీ



అర్జీలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న సిబ్బంది

అర్జీదారులకు సదుపాయాలు

నర్సీపట్నం ఆర్డీవో జయరాం, నాతవరం తహసీల్దార్ ఎస్.ఎస్.వి.శ్రీనివాసనాయుడు నాతవరంలో ఏర్పాటు చేసిన జేకేసీ స్పందన కార్యక్రమంలో అర్జీదారులకు అన్ని సౌకర్యాలనూ కల్పించారు. నీడ కోసం షామియానాలు, కూర్చునేందుకు కుర్చీలు, తాగునీరు తదితర సౌకర్యాలు ఏర్పాటు చేశారు. జిల్లా, మండల స్థాయి అధికారులతోపాటు గ్రామ సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్లు, గ్రామ కార్యదర్శులు, వీఆర్‌ఓలు హాజరయ్యారు.

విశేష 'స్పందన'

నాతవరం: మండల కేంద్రం నాతవరంలో కలెక్టరు రవి పట్టాన్‌శెట్టి నిర్వహించిన జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమానికి విశేష స్పందన వచ్చింది. 170కి పైగా అర్జీలను కలెక్టరు రవి పట్టాన్‌శెట్టి, జాయింట్ కలెక్టరు జాహ్నవి స్వీకరించారు. రెవెన్యూ పరమైన సమస్యలు, ఇళ్ల స్థలాలు, పింఛన్లు, భవన నిర్మాణాలకు సంబంధించిన వినతులు అధికంగా వచ్చాయి.

వారానికి రెండు మండలాల్లో..

జేకేసీ స్పందనను ఇకపై వారానికి రెండు మండల కేంద్రాల్లో నిర్వహించనున్నట్టు కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి చెప్పారు. ప్రతి బుధ, శుక్రవారాల్లో నిర్వహిస్తామన్నారు. ఈ నెల షెడ్యూల్‌ను కూడా కలెక్టర్ ప్రకటించారు. 13వ తేదీన రావికమతం, 15న కోటవురట్ల, 20న బుచ్చెయ్యపేట, 22న గొలుగొండ, 27న రోలుగుంట, 29న దేవరాపల్లిలో జేకేసీ స్పందన ఏర్పాటు చేశారు.

ప్రతి అర్జీకి స్పష్టమైన సమాధానం

జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమంలో వచ్చిన అభ్యర్థనలు, సమస్యలన్నింటినీ వెంటనే పరిష్కరించాలి. పరిష్కారం కాని ప్రతీ అర్జీకి స్పష్టమైన వివరణ ఇవ్వాలి. సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాలో నాతవరంలో తొలిగా నిర్వహించిన జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమానికి విశేష స్పందన వచ్చింది. నాతవరం మండలంతో పాటు సమీప మండలాల నుంచి కూడా వచ్చి సమస్యలు విన్నవించుకున్నారు. ఎక్కువగా సివిల్ తరహా సమస్యలు వచ్చాయి. సంక్షేమ పథకాలకు సంబంధించి సమస్యలు నాలుగు వచ్చాయి. వాటిని తక్షణమే పరిష్కరించాం.

– రవి పట్టాన్‌శెట్టి, కలెక్టర్

పట్టా ఇచ్చారు.. స్థలం చూపించలేదు



ఏడాది క్రితం ఇంటి పట్టా ఇచ్చారు. ఇల్లు మంజూరు చేశారు. ఆ తరువాత మాకు చూపించిన స్థలంలో ఇల్లు కట్టవద్దని ఆదేశించారు. వేరొకచోట స్థలం చూపించలేదు.

– జి.పెదనాగలక్ష్మి, తాండవ జంక్షన్

ఆక్రమణలు తొలగించాలి



మా గ్రామంలో పంట కాలువలను ఆక్రమించారు. దీంతో పొలాలకు నీరు అందడం లేదు. ఆయకట్టు పరిధిలో రైతులంతా ఇబ్బందులు పడుతున్నారు.సర్వే చేసి ఆక్రమణలు తొలగించాలి

– కుశరాజు, గునుపూడి గ్రామం

పాసుపుస్తకాలు ఇప్పించాలి



నేను పూర్వం నుంచి సాగు చేస్తున్న భూమికి పాసు పుస్తకాలు ఇవ్వాలని రెవెన్యూ అధికారులు చుట్టూ తిరుగుతున్నా కాలయాపన చేస్తున్నారు. నాకు పాసుపుస్తకాలు ఇప్పించాలి.

– గడమాల జోగిరాజు, ములగపూడి గ్రామం

డబ్బులు వాపస్ చేస్తామన్నారు



చమ్మచింత పంచాయతీ 1/70 యాక్టు పరిధిలో ఉండడంతో గిరిజనేతరులకు రిజిస్ట్రేషన్లు చేయలేదు. స్పందనలో ఫిర్యాదు చేస్తే రిజిస్ట్రేషన్‌కు కట్టించుకున్న రూ.10 వేలు వాపసు ఇమ్మని కలెక్టరు ఆదేశించారు,

– నానాజీ, చమ్మచింత గ్రామం

అటవీ హక్కు పత్రాలు ఇవ్వాలి



పోడు వ్యవసాయం చేసుకుంటున్న భూమికి హక్కు పత్రాలు ఇవ్వాలి. నాతో పాటే వ్యవసాయం చేసుకునే కొంతమందికి హక్కు పత్రాలు ఇచ్చారు. ఆ పక్కనే ఉన్న నా భూమికి పత్రాలు రాలేదు.

– గొలగాని లక్ష్మి, ఎస్టీ కాలనీ, నాతవరం

శ్రావణ లక్ష్మి కి నీరాజనాలు



అనకాపల్లిలో గాజుల అలంకరణలో గౌరీ దేవి



అనకాపల్లి నూకాంబిక ఆలయంలో సామూహిక కుంకుమార్చన



మాడుగుల మండలం జంపెనలో కరెన్సీ నోట్లతో వాసవీ మాతకు అలంకరణ

అనకాపల్లి టౌన్/మాడుగుల: శ్రావణమాసం నాలుగో శుక్రవారం సందర్భంగా పలు అమ్మవార్ల దేవాలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. అనకాపల్లి గవరపాలెం నూకాంబిక అమ్మవారి బాలాలయంలో మహిళలు కుంకుమార్చనలు చేపట్టారు. భక్తులకు ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో బండారు ప్రసాద్, దేవస్థానం చైర్మన్ కొణతాల మురళీకృష్ణ పాల్గొన్నారు. గవరపాలెం గౌరీ పంచాయతన దేవాలయంలో అమ్మవారు గాజుల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు బొడ్డేడ సన్యాసినాయుడు ఏర్పాట్లు చేశారు. మాడుగుల మండలం జంపెన గ్రామంలో కింతలి గాదిరాయి రూరల్ వాసవీ క్లబ్ సభ్యులు రూ.5 లక్షల కరెన్సీ నోట్లతో వాసవీ మాతను అలంకరించారు. సుమారు రెండు వేల మందికి అన్నసమారాధన చేశారు.

ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పుట్టా మోహనరావు, కన్యకాపరమేశ్వరి వాసవీ క్లబ్ అధ్యక్షుడు మేడిశెట్టి అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

విమ్స్‌లో సీబీఆర్‌ఎన్ సెంటర్



విమ్స్‌లో ఇన్ పేషెంట్‌తో మాట్లాడుతున్న మంత్రి విడదల రజని

ఆరిలోవ: విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్)లో కెమికల్ బయోలాజికల్ రేడియోలజికల్ న్యూక్లియర్(సీబీఆర్‌ఎన్) సెంటర్‌ను ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్లు రాష్ట్ర ఆరోగ్యశాఖా మంత్రి విడదల రజని తెలిపారు. శుక్రవారం సాయంత్రం విమ్స్‌ను ఆమె ఆకస్మికంగా సందర్శించారు. వైద్యాధికారులతో కలిసి ఆమె ఇక్కడ పలు విభాగాలు పరిశీలించారు. ఇన్‌పేషెంట్ వార్డులు, ఐసీయూల్లో పేషెంట్లను పలకరించి ఆరోగ్య పరిస్థితి తెలుసుకొన్నారు. అనంతరం ఆమె రాష్ట్ర ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.టి కృష్ణబాబు, ఏపీఎంఎస్ఐడీసీ ఎండీ మురళీధరరెడ్డి, డీఎంఈ నర్సింహం, విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు. వైద్యాధికారులతో కలసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విమ్స్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం దేశంలో 10 సీబీఆర్‌ఎన్‌లు ఏర్పాటుకు శ్రీకారం చుట్టిందన్నారు. వాటిలో ఒక సెంటర్‌ను మన రాష్ట్రంలో విమ్స్‌లో ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకొన్నట్లు తెలిపారు. విమ్స్‌లో డయాగ్నస్టిక్ సెంటర్, ఆయుష్, ఔషధ నియంత్రణ విభాగం నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయన్నారు.

భర్త చేతిలో భార్య హతం ● మద్యం మత్తులో ఘర్షణ ఫలితం IIలో

- తొలిసారిగా ఏయూకు గవర్నర్ అబ్దుల్ నజీర్
- చాన్సలర్ హోదాలో హాజరు
- నేటి మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభం

స్నాతకోత్సవానికి వేళాయె..



స్నాతకోత్సవం జరిగే సర్ కట్టమంచి రామలింగారెడ్డి ఉత్సవ రంగం

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయం స్నాతకోత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. శనివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి కట్టమంచి రామలింగారెడ్డి స్నాతకోత్సవ మందిరంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే స్నాతకోత్సవం నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు. నాలుగేళ్లకు కలిపి నిర్వహిస్తున్న సంయుక్త స్నాతకోత్సవంలో సైన్స్–పరిశ్రమల రంగంలో అవంతి ఫీడ్స్ ఎం.డి. అల్లూరి ఇంద్రకుమార్‌కు, సాహిత్య రంగంలో ఎస్వీ యూనివర్సిటీ పూర్వ వీసీ కొలకలూరి ఇనాక్‌లకు గౌరవ డాక్టరేట్‌లను ప్రదానం చేస్తున్నారు. ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాద రెడ్డి ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు. స్నాతకోత్సవాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నారు. డాక్టరేట్ డిగ్రీలు, మెడల్స్ తీసుకునే వారికి ప్రత్యేకమైన సీటింగ్ ఏర్పాటు చేశారు. వారికి కేటయించిన నంబర్లలో మాత్రమే వారు కూర్చోవాల్సి ఉంటుంది. వీరితో పాటు వచ్చే కుటుంబ సభ్యులకు ప్రత్యేకంగా సీటింగ్ ఏర్పాట్లు చేశారు. ప్రతీ 20 సీట్లకు ఒక వలంటీర్ సమన్వయం చేయనున్నారు. ఉదయం 10 గంటల నుంచి వీరిని ప్రాంగణంలోకి అనుమతిస్తారు. మధ్యాహ్నం 1.30 గంటల తర్వాత ఎవ్వరినీ లోపలికి అనుమతించరు.


690 మందికి పీహెచ్‌డీలు

స్నాతకోత్సవంలో 690 మంది పీహెచ్‌డీలు, 600 మంది వరకు మెడల్స్, ప్రైజ్‌లను తీసుకోనున్నారు. స్నాతకోత్సవంలో డిగ్రీలు తీసుకునే వారికి అసెంబ్లీ మందిరం వద్ద గౌన్‌లు అందుబాటులో ఉంచుతున్నారు. స్నాతకోత్సవం వీక్షించే వారికి అసెంబ్లీ మందిరంలో ప్రత్యేకంగా ప్రత్యక్ష ప్రసారాన్ని ఏర్పాటు చేస్తున్నారు. స్నాతకోత్సవాన్ని పూర్తిగా యూట్యూబ్‌లో ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నారు.

ఏర్పాట్లను పరిశీలించిన భద్రతా సిబ్బంది

గవర్నర్ వ్యక్తిగత భద్రతా సిబ్బంది శుక్రవారం మధ్యాహ్నం స్నాతకోత్సవ మందిరాన్ని సందర్శించి, భద్రతా ఏర్పాట్లు పరిశీలించారు.గవర్నర్ ప్రయాణించే వాహనాలతో కూడిన కాన్వాయ్ స్నాతకోత్సవ మందిరానికి వచ్చింది. గవర్నర్ సుమారు రెండు గంటల సమయం ఏయూలో గడపనున్నారు. గవర్నర్ కోసం వేదికకు ఎడమవైపున గ్రీన్‌రూం ఏర్పాటు చేశారు.

కొలకలూరి ఇనాక్



విద్యావేత్తగా, రచయితగా, సామాజిక వేత్తగా, పరిపాలనాదక్షుడిగా ఆచార్య కొలకలూరి ఇనాక్ సుపరిచితులు. పేద కుటుంబం నుంచి వచ్చిన ఆయన తమ మేధస్సుతో ఉన్నతంగా ఎదిగారు. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం ఉపకులపతిగా ఆయన సేవలు అందించారు. ఆయన స్వస్థలం గుంటూరు జిల్లా వేజెండ్ల. 1939 జూలై 1న ఆయన జన్మించారు. దాదాపు 42 ఏళ్లకు పైగా ఆయన బోధన రంగంలో ఉన్నారు. ఆయన 10 మేజర్ రీసెర్చ్ ప్రాజెక్టులను, 10 మైనర్ రీసెర్చ్ ప్రాజెక్టులను చేశారు. ఆయన మార్గదర్శకంలో 24 మంది డాక్టరేట్‌లు స్వీకరించగా, 18 మంది ఎంఫిల్ పూర్తి చేశారు. ఇప్పటికే 200కిపైగా పరిశోధన పత్రాలను వివిధ జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో సమర్పించారు. దాదాపు ఆరు దశాబ్దాలుగా సాహితీ రంగానికి ఎనలేని సేవలు అందించారు.

అల్లూరి ఇంద్రకుమార్




అవంతి ఫీడ్స్ లిమిటెడ్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా అల్లూరి ఇంద్రకుమార్ ఉన్నారు. ఆక్వాకల్చర్ రంగంలో ఈ సంస్థ పని చేస్తోంది. 30 ఏళ్లుగా ష్రింప్ ఫీడ్ మాన్యుఫాక్చరింగ్, హేచరీస్, ఫామ్స్, ప్రోసెసింగ్ రంగంలో ఈ సంస్థ పని చేస్తోంది.భారత దేశంలో ష్రింప్ కల్చర్ ఇండస్ట్రీతో అల్లూరి ఇంద్రకుమార్‌కు అనుబంధం ఉంది. గతంలో మోస్ట్ ట్రస్టెడ్ సీఈవోగా, బెస్ట్ వాల్యూ క్రియేటర్‌గా అవార్డులు అందుకున్నారు. సీఫుడ్ ఎక్స్‌పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడిగా, సీఆర్ రెడ్డి విద్యాసంస్థలు, ఏబీఏ పీఆర్‌ఆర్ కళాశాలల చైర్మన్‌గా సేవలందించారు. అగ్రికల్చర్ స్కిల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా డైరెక్టర్‌గా సేవలు అందించారు. పదుల సంఖ్యలో జాతీయ స్థాయిలో అవార్డులను అందుకున్నారు.

గవర్నర్‌కు ఘన స్వాగతం



విశాఖ విమానాశ్రయంలో గవర్నర్‌కు స్వాగతం పలుకుతున్న మేయర్ హరి వెంకట కుమారి



స్వాగతం పలుకుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

గోపాలపట్నం (విశాఖ) : గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు విశాఖ విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. రెండు రోజుల పర్యటనలో భాగంగా ఆయన శుక్రవారం విశాఖ చేరుకున్నారు. మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ, డీఐజీ ఎస్.హరికృష్ణ, ఏడీసీపీ విద్యాసాగర్ నాయుడు, తదితరులు ఆయనకు స్వాగతం పలికారు. విమానాశ్రయం నుంచి గవర్నర్ నేరుగా పోర్టు అతిథి గృహానికి వెళ్లారు.

క్లుప్తంగా

బీజేపీ మీడియా ప్రతినిధిగా ఈర్లె



చోడవరం రూరల్: భారతీయ జనతా పార్టీ రాష్ట్ర స్థాయి మీడియా ప్రతినిధిగా చోడవరానికి చెందిన ఈర్లె శ్రీరామ్మూర్తి నియమితులయ్యారు. అనకాపల్లి జిల్లా నుంచి ఆయనకు ప్రాతినిధ్యం కల్పిస్తూ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి శుక్రవారం ప్రకటించారు. ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి ఈర్లె ఒక్కరికే రాష్ట్ర మీడియా ప్యానల్‌లో చోటు దక్కడం విశేషం. వీఆర్వోల సంఘం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడిగా విశేష సేవలందించిన శ్రీరామ్మూర్తి తెలుగుదేశం, కాంగ్రెస్, ప్రజారాజ్యం పార్టీల్లో చురుకైన పాత్ర పోషించారు. ఇటీవల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ టికెట్‌ను ఆశించి భంగపాటుకు గురైన ఆయన ఇండిపెండెంట్‌గా పోటీ చేసేందుకు సిద్ధమయ్యారు. ఆ సమయంలో బీజేపీ తీర్థం పుచ్చుకుని తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలిగా పురందేశ్వరి పగ్గాలు చేపట్టిన తర్వాత పార్టీలో ఈర్లెకు సముచిత స్థానం లభించింది. ఆయన రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో చోడవరం లేదా మాడుగుల నుంచి టికెట్టు ఆశిస్తున్నట్టు తెలుస్తోంది.

‘ఉట్టి’పడిన ఉత్సవం



ఉట్టిని అందుకుంటున్న భక్తుడు



ఉట్టి తాడుని లాగుతున్న ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు



ఉపమాకలో ఉట్ల సంబరాన్ని నిర్వహిస్తున్న అర్చకులు



ఉపమాకలో వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

- శ్రీకృష్ణాలంకారంలో దర్శనమిచ్చిన అప్పన్న

సింహాచలం: వరాహ లక్ష్మీనసింహస్వామి శుక్రవారం శ్రీకష్ణాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చాడు. సింహగిరిపై జరుగుతున్న శ్రీకష్ణాష్టమి వేడుకల్లో భాగంగా సాయంత్రం ఉట్ల సంబరాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ ఉత్సవాన్ని కనులారా తిలకించారు. ఆనంద డోలికల్లో మునిగితేలారు. సాయంత్రం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామికి శ్రీకష్ణాలంకారం చేసి శ్రీదేవి, భూదేవి సమేతంగా పల్లకిలో అధిష్ఠింపజేశారు. తొలుత ఆలయ బేడా తిరువీధి నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులను రాజగోపురంలో వేంజేపచేశారు. ఆలయ ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసరావు తాడు లాగగా యాదవులు ఉట్టిని అందుకున్నారు. అనంతరం స్వామికి విశేషంగా హారతులిచ్చారు. భక్తులకు తీర్థం, వెన్న ప్రసాదాన్ని అందజేశారు. తర్వా సింహగిరి మాడ వీధుల్లో స్వామికి తిరువీధి నిర్వహించారు. దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, వారణాసి దినేష్‌రాజ్ పాల్గొన్నారు.

నేత్రపర్వంగా ఉట్ల సంబరం

నక్కపల్లి: కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా శుక్రవారం ఉపమాక వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో ఉట్ల సంబరం వేడుకగా జరిగింది. ఈ సందర్భంగా పలువురు ఉట్టి కొట్టడానికి పోటీ పడ్డారు. ఈ ఉట్టి కొట్టే సన్నివేశాన్ని ప్రధానార్చకుడు గొట్టుముక్కల వరప్రసాద్, అర్చక స్వాములు ఆధ్వర్యంలో ఆద్యంతం ఉత్సాహంగా నిర్వహించారు. అనంతరం శ్రీదేవీ భూదేవీ సమేత వేంకటేశ్వర స్వామివారిని రాజాధి రాజ వాహనంలోనూ గోదాదేవి అమ్మవారిని యశోద అలంకరణలో పెద్ద పల్లకిలోనూ ఉంచి గ్రామ తిరువీధి సేవ నిర్వహించారు. అదేవిధంగా శ్రావణ శుక్రవారం కావడంతో ఆండాళ్లమ్మవారి సన్నిదిలో సహస్ర కుంకుమార్చన చేశారు. తిరువీధి సేవలు, ఉట్ల సంబరాల్లో పలువురు భక్తులు పాల్గొన్నారు.

13,14 తేదీల్లో ఉమ్మడి జిల్లా స్థాయి క్రీడా జట్ల ఎంపిక

చోడవరం రూరల్ : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 13,14 తేదీల్లో ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయి క్రీడా జట్లు ఎంపిక చేస్తున్నట్లు ఆర్ఐవో రాయల సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. 13న ఉదయం 10గంటలకు టెన్నీకాయిట్, కబడ్డీ, బాల్ బాడ్మింటన్, 14న వాలీబాల్, త్రో బాల్‌కు ఎంపికలు ఉంటాయన్నారు. చోడవరం ప్రభుత్వ జూనియర్ కాలేజీ క్రీడా ప్రాంగణంలో వీటిని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అండర్-19 క్రీడా జట్లు ఎంపిక కోసం 01-01-2005 తర్వాత జన్మించిన వారు అర్హులని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి జి. రాంబాబు తెలిపారు. ఆయా కాలేజీల నుంచి ఆసక్తి ఉన్న విద్యార్థులను క్రీడా మైదానానికి తీసుకొచ్చేలా పీడీలు శ్రద్ధ తీసుకోవాలన్నారు.

10న పవర్‌లిఫ్టింగ్ పోటీలు

విశాఖ స్పోర్ట్స్: జిల్లాస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు ఈ నెల 10వ తేదీన పూర్ణామార్కెట్ దరి శ్రీ విజయాంధ్ర వ్యాయామ మండలిలో జరగనున్నాయి. జూనియర్, సీనియర్, మాస్టర్స్‌కు మెన్, వుమెన్‌లో పవర్‌లిఫ్టింగ్, బెంచ్ ప్రెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా పవర్ లిఫ్టింగ్ సంఘం కార్యదర్శి ప్రభాకర రావు తెలిపారు.

భర్త చేతిలో భార్య హతం

- కట్నంగా ఇచ్చిన భూమి విక్రయించలేదని ఘాతుకం
- మద్యం మత్తులో ఘర్షణ ఫలితం

మద్యానికి బానిసైన అతడు తనకు కట్నంగా ఇచ్చిన ఆస్తిని అమ్మాలని భార్యపై ఒత్తిడి చేశాడు. దానికి ఆమె ససేమిరా అనడంతో గొంతు నులిమి చంపేశాడు. ఆపై ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేసి పోలీసులకు లొంగిపోయాడు. ఈ ఘటన రోలుగుంట మండలంలో ఆలస్యంగా వెలుగులో చూసింది.



అపర్ణ మృతదేహం



అపర్ణ (ఫైల్)

రోలుగుంట: మండలంలోని వడ్డిపలో భర్త చేతిలో భార్య హత్యకు గురైంది. ఈ ఘటన శుక్రవారం వెలుగు చూసింది. స్థానికుల కథనం మేరకు.. నక్కపల్లి మండలం కోసరపాడు గ్రామానికి చెందిన అల్లు అపర్ణ(28)కు రోలుగుంట మండలం వడ్డిప గ్రామానికి చెందిన లక్ష్మణ్‌తో ఎనిమిదేళ్ల క్రితం వివాహమైంది. అన్యోన్యంగా సాగుతున్న వీరి దాంపత్యంలో రితిక్ (6), సాత్విక్(4) కుమారులున్నారు. అయితే తన కుమార్తె కట్న కానుకలుగా ఆమె తండ్రి అప్పలనాయుడు అరెకరా భూమి, ఇతర లాంఛనాలు ఇచ్చాడు. ఈ నేపథ్యంలో కొంతకాలంగా మద్యానికి బానిసగా మారిన లక్ష్మణ్ తన భార్యకు కట్నంగా ఇచ్చిన భూమి అమ్మి డబ్బు తేవాలని తరచూ గొడవ పడుతున్నాడు. అదే మాదిరిగా గురువారం రాత్రి పూటుగా మద్యం సేవించి ఇంటికి వచ్చి గొడవపడ్డాడు. ఈ క్రమంలో ఆమెపై చేయి చేసుకోవడంతోపాటు కోపోద్రిక్తుడై గొంతు నొక్కడంతో ఊపిరాగిపోయింది. గమనించిన అతడు ఇంట్లో ఆమె ఆత్మహత్య చేసుకున్నట్టుగా ఉరేశాడు. ఆపై భయంతో పోలీసు స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. అయితే తెల్లవారు తర్వాత అపర్ణ అలికిడి లేకపోవడంతో ఇరుగుపొరుగు వారు ఆమె చనిపోయిన విషయం తెలుసుకుని మృతురాలి తండ్రి అప్పలనాయుడుకు సమాచారం ఇచ్చారు. అతడు వచ్చి బోరున విలపిస్తూ రోలుగుంట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఎస్సై నాగకార్తీక్ గ్రామానికి వచ్చి విచారించారు. కేసు నమోదు చేసి స్థానికులను విచారించారు. కొత్తకోట సీఐ ఇలియాస్ మహమ్మద్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోలీసుల అదుపులో ఉన్న నిందితుడిని విచారిస్తున్నట్టు తెలిసింది.

డెంగ్యూ కేసులు నమోదైన గ్రామాల్లో పర్యవేక్షణ



ములగపూడి వీధుల్లో పర్యటిస్తున్న కలెక్టరు రవి పట్టాన్‌శెట్టి

- ములగపూడిలో కలెక్టరు ఆకస్మిక తనిఖీలు

నాతవరం: రోగుల విషయంలో నిర్లక్ష్యం చేయొద్దని, తరుచూ డెంగ్యూ కేసులు నమోదయ్యే గ్రామాల్లో వీధులపై వైద్యాధికారుల పర్యవేక్షణ పెంచాలని డీఎంహెచ్‌వో హేమంత్‌కు కలెక్టరు రవి పట్టాన్‌శెట్టి సూచించారు. మండలంలోని ములగపూడిలో పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, హెల్త్ సబ్ సెంటరును శుక్రవారం కలెక్టరు ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల రికార్డులను పరిశీలించి పాఠ్యాంశాల్లో కొన్ని ప్రశ్నలు వేశారు. మెనూ నిబంధనల ప్రకారం అమలు చేసేలా పర్యవేక్షణ ఉండాలని ఎంఈవో అమృత్‌కుమార్‌ను ఆదేశించారు. తర్వాత అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో కొంతసేపు ముచ్చటించారు. కేంద్రం పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. మండల వ్యాప్తంగా కేంద్రాల పని తీరులో ఇంకా మార్పు రావాలని ఐసీడీఎస్ పీవో శ్రీగౌరిని ఆదేశించారు. ఇటీవల డెంగ్యూ కేసు నమోదైన వీధిలో స్వయంగా పర్యటించారు. పారిశుధ్య పనులు మెరుగ్గా ఉండేలా క్షేత్రస్థాయిలో అధికారులు దృష్టి సారించాలన్నారు. ఈయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రశాంతి, ఆర్డీవో హెచ్.వి. జయరాం, తహసీల్దార్ ఎస్.ఎస్.వి. శ్రీనివాసనాయుడు, వైద్యాధికారి ప్రసన్న ఉన్నారు.

బ్యాంకు ఖాతాలో నగదు మాయంపై ఫిర్యాదు



స్టేట్‌మెంట్ చూపిస్తున్న బాధితుడు

బుచ్చెయ్యపేట: బ్యాంక్ ఖాతాలో నగదు మాయంపై మండలంలోని చింతపాకకు చెందిన సలాది పైడినాయుడు కంగుతిన్నాడు. అతడికి సీతయ్యపేట స్టేట్ బ్యాంక్‌లో 37835967022 నంబర్‌తో ఖాతా ఉంది. అతడి ప్రమేయం లేకుండా తన బ్యాంకు ఖాతా నుంచి ఈ నెల 7వ తేదీన రూ.10 వేలు, 8వ తేదీన రూ.3,500 డ్రా చేసినట్లు ఫోన్‌కు సమాచారం వచ్చింది. దీంతో షాక్‌కు గురైన బాధితుడు శుక్రవారం బ్యాంకుకి వెళ్లి స్టేట్‌మెంట్ తీయగా, తన ఖాతా నుంచి నగదు డ్రా అయినట్లు వచ్చింది. దీనిపై బ్యాంకు మేనేజర్‌కు న్యాయం చేయాలని ఫిర్యాదు చేశాడు. బుచ్చెయ్యపేట పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నట్లు బాధితుడు తెలిపాడు.

అపార్టుమెంట్‌పై నుంచి పడి ఒడిశా కార్మికుడి మృతి

అచ్యుతాపురం(అనకాపల్లి): అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలం కుమారపురంలో శుక్రవారం ఓ అపార్టుమెంట్‌పై నుంచి జారి పడి ఒడిశా రాష్ట్రం నల్లిపూర్‌కు చెందిన మాలిక్ మనోజ్(28) మృతి చెందాడు. ఈయన బతుకు దెరువు నిమిత్తం వచ్చి ఇక్కడ హోటల్ పనిచేస్తూ అపార్టుమెంట్‌లో నివసిస్తున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు జారి పడి మృతి చెందాడు. అతడికి భార్య, పాప ఉన్నారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు ఆర్.రాము కోరారు.

వృద్ధుడిని ఢీకొట్టిన గుర్తు తెలియని వాహనం

- ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి



రాజబాబు మృతదేహం

బుచ్చెయ్యపేట: మండలంలోని సీతయ్యపేటలో గుర్తు తెలియని ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో గ్రామానికి చెందిన పసుపులేటి రాజబాబు(67) మృతి చెందాడు. గురువారం పాల కేంద్రానికి వెళ్లి తట్టబంద రోడ్డులో ఇంటికి నడిచి వస్తుండగా ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని ద్విచక్ర వాహనం ఢీకొంది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో అతడు గాయాలతో రోడ్డు పక్కన అపస్మారక స్థితిలో పడిపోయాడు. పది గంటల ప్రాంతంలో దారినపోయేవారు చూసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించి రావికమతం ఆస్పత్రికి తరలించారు. శుక్రవారం ఉదయం పరిస్థితి విషమంగా మారడంతో అనకాపల్లి ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మితోపాటు వివాహమైన ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కుమారస్వామి తెలిపారు.

పీవీ సింధు బ్యాడ్మింటన్ అకాడమీ స్థలానికి పన్ను మినహాయింపు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ జోన్-2 పరిధి చినగదిలి సర్వే నంబర్ 72/11, 83/5, సర్వే నంబర్ 6పీలో పీవీ సింధు బ్యాడ్మింటన్ అకాడమీ కేటాయించిన రెండెకరాల భూమికి ఖాళీ ఆస్తి పన్నును మినహాయించారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం జరిగిన స్థాయీ సంఘ సమావేశంలో చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన సభ్యులు ఈ అంశంపై నిర్ణయం తీసుకున్నారు. స్పోర్ట్స్ స్కూల్, క్రీడలను ప్రోత్సహించే విషయమై రాష్ట్ర ప్రభుత్వం ఇక్కడ సింధుకు రెండు ఎకరాలు కేటాయిస్తూ జీవో 134ను జారీ చేసిన సంగతి తెలిసిందే. కలెక్టర్ ఉత్తర్వుల మేరకు ఆ భూమిని స్వాధీనం చేసుకుని అకాడమీకి అప్పగించారు. ఆ స్థలానికి ఇప్పటివరకు ఖాళీ ఆస్తి పన్ను రూ.82,46,790 బకాయి ఉంది. ఈ మేరకు ఆ స్థలానికి ఖాళీస్థలం పన్ను మినహాయింపు కోరుతూ పి.వి. సింధు ప్రభుత్వానికి దరఖాస్తు పెట్టుకున్నారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ఆ స్థలానికి వీఎల్‌టీని మాఫీ చేయాలని ముఖ్యమంత్రిని కలిసి విన్నవించారు. ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు భవనం పూర్తయ్యే వరకు ఖాళీస్థలం పన్నును మినహాయిస్తూ జీవీఎంసీ ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు ఉన్న బకాయిని మినహాయిస్తూ స్థాయీ సంఘం నిర్ణయం తీసుకుంది.

11 నుంచి జైళ్లశాఖ జాతీయ సదస్సు

ఆరిలోవ : జైళ్ల శాఖ ఎనిమిదో జాతీయ సదస్సుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చి అండ్ డెవలప్‌మెంట్, ఏపీ జైళ్ల శాఖ సంయుక్తంగా ఈ సదస్సు నిర్వహిస్తున్నాయి. ఈనెల 11, 12 తేదీల్లో జరగనున్న ఈ సదస్సుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా రాష్ట్రంలో పలు కేంద్ర కారాగారాలు, సబ్ జైళ్ల నుంచి విశాఖపట్నం కేంద్ర కారాగానికి చేరుకొన్నారు. శుక్రవారం ఈ కారాగారాన్ని సందర్శించిన రాష్ట్ర జైళ్ల శాఖ ఐజీ ఇండ్ల శ్రీనివాసరావు ఆయా అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. జాతీయ సదస్సు విజయవంతంగా నిర్వహించడానికి సలహాలు సూచనలు చేశారు. సుమారు 50 మందితో నిర్వహించిన ఈ సమావేశంలో అధికారులకు జాతీయ సదస్సు నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. ఎవరు ఏఏ పనులు చేపట్టాలో గ్రూపులుగా విభజించారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ జైళ్ల శాఖ ఎనిమిదో జాతీయ సదస్సు విశాఖలో రుషికొండ దరి సాయిప్రియ రిసార్ట్స్‌లో రెండు రోజులు పాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. దేశంలో అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో జైళ్ల శాఖ డీజీ స్థాయి ఉన్నతాధికారులు ఉమారు 140 మంది వరకు పాల్గొంటారన్నారు. వారందరికీ సాయిప్రియ రిసార్ట్స్‌తో పాటు దీనికి అందుబాటులో ఉన్న వైజాగ్ కన్వెన్షన్‌లో వసతి కల్పిస్తున్నట్లు తెలిపారు. సదస్సు ప్రారంభోత్సవంలో కేంద్ర హోంశాఖ మంత్రి అజయ్‌కుమార్ మిశ్రా, రాష్ట్ర హోం శాఖామంత్రి తానేటి వనిత హాజరుకానున్నారన్నారు. ముగింపు సదస్సుకు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ రానున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో వివిధ జైళ్లకు చెందిన 50 మంది అధికారులను ఎంపిక చేసి బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. సదస్సులో జైళ్ల శాఖలో గడిచిన 75 ఏళ్లలో ఎలాంటి పరిణామాలు చోటుచేసుకొన్నాయి, ఎలాంటి అభివృద్ధి జరిగింది, ప్రస్తుతం లాంటి అభివృద్ధి చేయాలి అన్న అంశాలపై చర్చ జరగనుందన్నారు. దీంతో పాటు ముఖ్యంగా టెక్నాలజీ ఇన్ కరెక్షనల్ అడ్మినిస్ట్రేషన్, స్టేటస్ ఆఫ్ మెంటల్ హెల్త్ ఇన్ ప్రిజన్స్ ఇన్ ఇండియా, మోడల్ ప్రిజన్స్ లెజిస్లేషన్, డీప్ అడిషన్ ఆఫ్ ప్రిజనర్స్, ఓవర్ ప్రిజన్స్, అల్టర్నేటివ్స్ టు ఇన్‌కార్సిరేషన్ అనే 6 అంశాలపై చర్చిస్తారన్నారు. మన రాష్ట్రంలో జాతీయ సదస్సు నిర్వహించడం ఇది రెండోసారని ఐజీ తెలిపారు.

ఆలిండియా ఆన్‌లైన్ యోగా పోటీల్లో రిషిత ప్రతిభ

- అండర్ - 8 నుంచి 10 విభాగంలో ప్రథమ స్థానం



విద్యార్థిని రిషితను అభినందిస్తున్న అప్పలరాజు, యోగా గురుపు సతీష్, దత్తు

కె.కోటపాడు: ఆలిండియా ఆన్‌లైన్ యోగా పోటీల్లో మండలంలోని చౌడువాడ శ్రీసాయి విద్యా విహార్ పాఠశాలకు చెందిన విద్యార్థిని ముమ్మిన రిషిత ప్రతిభ చూపింది. ఈ నెల 1 నుంచి 3వ తేదీ వరకు బెంగళూరులో అండర్ - 8 నుంచి 10 విభాగంలో యోగా పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొన్న రిషిత ఏకపాద శిరాసనం, బద్ధ పద్మాసనం వేసింది. ఈ విభాగంలో ప్రతిభ చాటి ప్రథమ స్థానం సాధించింది. దీంతో ఆమెకు నిర్వాహకులు ప్రశంసాపత్రంతోపాటు జ్ఞాపికను పంపించారు. పాఠశాలలో శుక్రవారం విద్యార్థిని రిషితను పాఠశాల చైర్మన్ దాట్ల అప్పలరాజు, యోగా గురువు పుల్లేటి సతీష్, ప్రిన్సిపాల్ దీవి అప్పలకొండ(దత్తు) అభినందించారు.

విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడిగా గంగారాం



జిల్లా నూతన కమిటీతో ప్రమాణ స్వీకారం చేయించిన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చేవూరి రామస్వామి

అనకాపల్లి టౌన్: జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడిగా మత్తూర్తి గంగారామ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం స్థానిక గవరపాలెం వి.వి.రమణ రైతు భారతి ఫంక్షన్ హాల్లో నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా చేబోలు సూరిబాబు, కోశాధికారిగా ఒంపోలు ఆచారి ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా వ్యవహరించిన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చేవూరి రామస్వామి నూతన కమిటీతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విశ్వబ్రాహ్మణులకు కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయడం ఆనందదాయకమన్నారు. తమ సామాజిక వర్గంలో ఐదు ఉప కులాలు ఉన్నాయని, వాటికీ కార్పొరేషన్లు ఏర్పాటు చేయాలని కోరారు. పంచవృత్తి పనులు చేసుకునే తమ జాతిలో ఇతర కులస్తులు పనిచేయడం, కార్పొరేట్ కంపెనీలు తమ రంగంలోకి ప్రవేశించడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వాపోయారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ వెనుకబడిన విశ్వబ్రాహ్మణ కులస్తులకు రాజకీయంగా ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో విశ్వబ్రాహ్మణ కులస్తులకు ఉద్యోగాలు కల్పించాలని కోరారు. సంఘం జిల్లా సీనియర్ నాయకుడు మత్తూర్తి ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు పెదపాటి గోవిందరావు, రాష్ట్ర సంఘం వర్కింగ్ అధ్యక్షుడు బొదులపాటి ఉమామహేశ్వరరావు, విశ్వబ్రాహ్మణ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కోటిపల్లి శ్రీదేవి పాల్గొన్నారు.

టౌన్ ప్లానింగ్‌లో బదిలీలు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ విభాగంలో బదిలీలు జరిగాయి. ఇటీవలే ఇదే విభాగం నుంచి నలుగురు అధికారులు పదోన్నతలు పొంది బదిలీ కాగా.. వారిలో ముగ్గురిని రిలీవ్ చేశారు. ఏసీపీలుగా పదోన్నతి పొంది విశాఖ వచ్చిన ఇద్దరు అధికారులకు వివిధ జోన్ల బాధ్యతలు అప్పగించారు. జోన్-1 భీమిలిలో ఏసీపీగా విధులు నిర్వహిస్తున్న దావాలా శ్రీనివాస్‌ను అదే స్థానంలో కొనసాగించారు. జోన్-2 మధురవాడ ఏసీపీగా శాస్త్రి, జోన్-3 ఆశీల్‌మెట్ట ఏసీపీగా సీహెచ్ రఘునాథరావును నియమించారు. జోన్-4 ఏసీపీగా వినయ్‌ప్రసాద్ యథావిధిగా కొనసాగించారు. జోన్-5 జ్ఞానాపురం ఏసీపీగా రామకృష్ణ, ఇటీవల పదోన్నతి పొందిన శ్రీలక్ష్మిని జోన్-6 గాజువాకకు ఏసీపీగా, నందిగామ నుంచి బదిలీపై వచ్చిన కె.ఝాన్సీని జోన్-7 అనకాపల్లి ఏసీపీగా నియమించారు. జోన్-8 పెందుర్తి ఏసీపీగా ఉన్న కె.జయరామ్ విశాఖపట్నం ఆర్డీడీగా బదిలీ అయినప్పటికీ.. బీఆర్‌టీఎస్ రోడ్ల విస్తరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో ఆయన్ని రిలీవ్ చేయలేదు. బొబ్బిలి నుంచి పదోన్నతిపై ఏసీపీగా వచ్చిన ఎస్.వెంకటేశ్వరరావును అడ్వర్టైజ్‌మెంట్ ఏసీపీగా నియమించారు. ఇదిలా ఉండగా డీసీపీలకు కూడా జోన్ బాధ్యతలు మార్పు చేస్తారని సమాచారం. ప్రస్తుతం జోన్-1 నుంచి జోన్-4 వరకు డీసీపీగా నరేంద్రనాథ్ రెడ్డి, జోన్-5 నుంచి జోన్-8 వరకు డీసీపీగా పద్మజ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. వీరిద్దరికీ చెరో రెండు జోన్లు తప్పించి ఇటీవల సిటీ ప్లానర్‌గా పదోన్నతి పొంది జీవీఎంసీలో బాధ్యతలు స్వీకరించిన లక్ష్మీదొరకు నాలుగు జోన్ల డీసీపీ బాధ్యతలు అప్పగించే అవకాశం ఉంది. అసిస్టెంట్ డైరెక్టర్ నుంచి డిప్యూటీ డైరెక్టర్ల హోదాతో పదోన్నతి పొందిన కె.వెంకటేశ్వరరావును వీఎంఆర్‌డీఏకు ప్లానింగ్ ఆఫీసర్‌గా బదిలీ చేయడంతో.. ఆయన్ని జీవీఎంసీ నుంచి రిలీవ్ చేశారు. గాజువాక ఏసీపీగా పనిచేస్తున్న సంపూర్ణ మహాపాత్రను ముందుగా బొబ్బిలి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి బదిలీ చేయగా.. తాజా ఉత్తర్వుల మేరకు గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్‌కు డీసీపీగా నియమించారు. దీంతో ఆయన కూడా జీవీఎంసీ నుంచి రిలీవ్ అయ్యారు. అనకాపల్లి ఏసీపీగా పనిచేస్తున్న అరుణవల్లి రాజమండ్రి రీజినల్ డిప్యూటీ డైరెక్టర్‌గా బదిలీ కాగా.. ఆమెను కూడా జీవీఎంసీ నుంచి రిలీవ్ చేశారు.

రేపు కిరండూల్ పాసింజర్ రద్దు

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్, గోరాపూర్-అరకు-సిమిలిగుడ స్టేషన్ల పరిధిలో చేపట్టిన భద్రతాపరమైన ఆధునికీకరణ పనుల నిమిత్తం విశాఖ-కిరండూల్-విశాఖ పాసింజర్ స్పెషల్ రైళ్లు రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి తెలిపారు. ఆదివారం విశాఖలో బయల్దేరాల్సిన విశాఖ-కిరండూల్ (08551) పాసింజర్ స్పెషల్ రద్దు చేశారు. తిరుగు ప్రయాణంలో కిరండూల్‌లో 11న బయల్దేరవలసిన కిరండూల్-విశాఖ (08552) పాసింజర్ స్పెషల్ రద్దు చేశామన్నారు.

క్లుప్తంగా

మంత్రి అమర్‌నాథ్‌కు ఆత్మీయ సత్కారం



మంత్రి అమర్‌నాథ్‌ను సత్కరిస్తున్న భోగలింగేశ్వరస్వామి దేవస్థానం సభ్యులు

అనకాపల్లిటౌన్‌: స్థానిక గవరపాలెం భోగలింగేశ్వర స్వామి దేవస్థానం నూతన కమిటీ సభ్యులుగా నియమితులైన వాసుపల్లి తాతయ్యలు మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను మిండిలోని ఆయన స్వగృహంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా తాతయ్యలు మాట్లాడుతూ దేవస్థానం అభివృద్ధికి తన కృషివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. రానున్న కార్తీక మాసంలో భక్తులకు అసౌకర్యం కలగకుండా ప్రత్యేక చర్యలు చేపడతామన్నారు. మంత్రిని కలిసిన వారిలో రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ శివ, పార్టీ నాయకులు మద్దాల సురేష్, కోన దుర్గాప్రసాద్‌లు పాల్గొన్నారు.

ఘనంగా శ్రావణ శుక్రవారం పూజలు

కశింకోట: కశింకోటలోని పలు ఆలయాల్లో శ్రావణ మాసం 4వ శుక్రవారం పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ధ్యాన వేంకటేశ్వరస్వామి ఆలయం, జాతీయ రహదారి వద్ద కనకదుర్గ, గవరపేటలోని కనక మహాలక్ష్మి, వేంకటేశ్వరస్వామి ఆలయాలకు భక్తులు భారీ సంఖ్యలో వచ్చారు. అమ్మవారిని దర్శించుకుని, పూజలు జరిపారు. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో కుంకుమార్చనలు నిర్వహించారు.

ఉపకరణాల మంజూరుకు వినతి



ఎంపీ సత్యవతికి వినతిపత్రం అందిస్తున్న జీవీఎంసీ ఏడీ దొర

అనకాపల్లిటౌన్‌: జీవీఎంసీ పరిధిలోని మహిళలకు కావాల్సిన ఉపకరణాలు మంజూరు చేయాలని ఎంపీ బీవీ సత్యవతిని ఆమె కార్యాలయంలో జీవీఎంసీ అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ వి.కె.దొర కోరారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఎంపీకి వినతిపత్రం అందించారు. రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్, జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టిలను సంప్రదించి, మంజూరుకు కృషి చేస్తానని ఎంపీ హామీ ఇచ్చారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శుక్రవారం 66 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	---	---
రెండో రకం	4,040	4,410
మూడోరకం	3,900	4,030

అనకాపల్లి సినిమాలు

ది నన్ నాజా	
గోవిందా రజగోవిందా	:సత్యనారాయణస్క్రీన్-1
తురుమ్ ఖాన్‌లు	:సత్యనారాయణస్క్రీన్-2
మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి	:శ్రీపరిసాయి
జవాన్	: శ్రీపరిసాయి
జవాన్	: వెంకటేశ్వర
మిస్టర్ ప్రెగ్నెంట్	: శ్రీసత్య
ఖుషి	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్‌: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 56 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్–10 యూనిట్లు, బీ పాజిటివ్–16 యూనిట్లు, బీ నెగిటివ్–2 యూనిట్లు, ఓ పాజిటివ్–22 యూనిట్లు, ఓ నెగిటివ్–2 యూనిట్లు, ఏబీ పాజిటివ్–2 యూనిట్లు, ఏబీ నెగిటివ్–2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400) ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్‌: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 328 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 295 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

సమపాళ్లలో అభివృద్ధి, సంక్షేమం

- సీఎం జగన్ పాలనలో రాష్ట్రం సుభిక్షం
- గడప గడపకు మన ప్రభుత్వంలో మంత్రి అమర్‌నాథ్



దివ్యాంగుడి సమస్యను వింటున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

అనకాపల్లిటౌన్‌: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉంది. అభివృద్ధి, సంక్షేమం సమ ప్రాధాన్యతతో పరుగులు తీస్తున్నాయని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక విజయరామరాజుపేట సచివాలయం–2 పరిధిలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ లబ్ధిని కుటుంబాల వారీగా గణాంకాలతో సహా వివరించారు. సంక్షేమ పథకాలపై రూపొందించిన బ్రోచర్లను పంపిణీ చేసి, ఎవరైనా పథకాలు అందుకోలేకపోయినట్టైతే తక్షణమే సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాల్సిందిగా సూచించారు. వృద్ధులను కలిసి పింఛన్లు సక్రమంగా అందుతున్నాయా? లేదా? అని ఆరా తీశారు. పథకాల పట్ల లబ్ధిదారులు సంతృప్తి వ్యక్తం చేస్తూ, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కొంతమంది వ్యక్తిగత సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఇద్దరు దివ్యాంగులు తాము నివసించేందుకు గృహాలు కావాలని కోరారు. జగనన్న కాలనీలో ఇళ్లను నిర్మించి ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని అక్కడ ఉన్న అధికారులను ఆదేశించారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. నిర్వాహకులతో మాట్లాడుతూ పిల్లలకు పోషకాహారాన్ని నాణ్యత, రుచితో అందించాలని సూచించారు. గత సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీలను దశల వారీగా అమలు చేసినట్టు తెలిపారు. రానున్న ఎన్నికల్లో మరోసారి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించాల్సిన అవశ్యకతను వివరించారు.



అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

అనకాపల్లిని జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయడంతో వివిధ ప్రభుత్వశాఖల అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి, త్వరితగతిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఇటీవల రాంచీలో జరిగిన నేషనల్ కిక్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో ప్రథమస్థానం సాధించిన వంశీని మంత్రి అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, నూకాంబిక అమ్మవారి దేవస్థానం చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, ఎన్టీఆర్ వైద్యాలయం అభివృద్ధి కమిటీ డైరెక్టర్ జి.రామ్మూర్తి, ఎంపీపీ గొర్లి సూరిబాబు, సూర్యనారాయణ మూర్తి దేవస్థానం చైర్మన్ కె.ఎం.నాయుడు, పార్టీ స్థానిక నాయకులు ఆడారి శ్రీనివాసరావు, ఉగ్గిన శ్రీను, అల్లు త్రినాథ్, దొడ్డి హరి, పలకా వాసు, సచివాలయ ఉద్యోగులు, ప్రభుత్వశాఖల అధికారులు, వలంటీర్లు, గ్రామ కమిటీల పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

విద్యా విధానంలో మార్పులతోనే అక్షరాస్యత

తుమ్మపాల: అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా పట్టణంలోని కస్పావీధి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సిద్ధార్థ సోషల్ సర్వీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. చదువు తల్లి సరస్వతి అనే అంశంపై జరిగిన పోటీల్లో ప్రతిభ కనబరచిన మొదటి ఐదుగురు విద్యార్థులకు అసోసియేషన్ అధ్యక్షుడు బల్లా నాగభూషణం, 82వ వార్డు కార్పొరేటర్ బి.దుర్గాదేవి ప్రశంసా పత్రాలను, జ్ఞాపికలను అందించి, స్వీట్లు పంచారు. తాలూత స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. నాగభూషణం మాట్లాడుతూ మన దేశంలో బడి ఈడు పిల్లలు ఇప్పటికీ 20 శాతం మంది నిరక్షరాస్యులుగానే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు విద్యావిధానంలో పటిష్టమైన మార్పులు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి ఉజ్జి సత్యనారాయణ, ఉపాధ్యాయుడు వికిరెడ్డి నిరీక్షణ్‌పుత్ర, కార్యవర్గ సభ్యులు రొబ్బి మల్లేశ్వరరావు, వట్నాల కృష్ణమోహన్, ప్రధానోపాధ్యాయుడు అల్లాడ శ్యాంబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.



చిత్రలేఖనం విజేతలకు ప్రశంసా పత్రాలు అందిస్తున్న బల్లా నాగభూషణం

పారిశుధ్య కార్మికుల సేవలు ప్రశంసనీయం



పారిశుధ్య కార్మికులకు నూతన యూనిఫాం అందిస్తున్న జానకీరామరాజు

అనకాపల్లిటౌన్‌: పట్టణ ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుధ్య కార్మికుల సేవలు అభినందనీయమని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు అన్నారు. స్థానిక ఉడ్‌పేట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల ఆవరణలో శుక్రవారం పారిశుధ్య కార్మికులకు ఉచితంగా యూనిఫారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా సమయంలో పారిశుధ్య కార్మికులు తమ ప్రాణాలను లెక్కచేయకుండా విధులు నిర్వర్తించి, ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చారని కొనియాడారు. కార్యక్రమంలో జీవీఎంసీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

నూతన పింఛన్ల పంపిణీతో ఆనందం



కశింకోట పంచాయతీ కార్యాలయంలో పింఛన్లు అందిస్తున్న బుల్లిబాబు, జయరజని



పొట్టి శ్రీరాములు పార్కు అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న బుల్లిబాబు

కశింకోట: ప్రతి నెలా క్రమం తప్పకుండా, సకాలంలో పింఛన్లు అందిస్తూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆపన్నులను ఆదుకుంటున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మలశాల బుల్లిబాబు అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో కొత్తగా పింఛన్లు మంజూరైన 42 మందికి సర్పంచ్ మలశాల జయరజనితో కలిసి పింఛన్ నగదు పంపిణీ చేశారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ, వారిని అన్ని విధాలా ఆదుకుంటున్న జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కొత్తగా పింఛన్లు మంజూరు కావడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు.

రూ.5 లక్షలతో పార్కు అభివృద్ధి

కశింకోటలోని పాల కేంద్రం వద్ద ఆంధ్ర రాష్ట్ర ఆవతరణకు ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములు పేరిట ఏర్పాటు చేసిన పార్కు పునరుద్ధరణ పనులు మలశాల బుల్లిబాబు శుక్రవారం భూమిపూజ చేశారు. పంచాయతీ రూ.5 లక్షలతో ఈ పనులు చేపట్టనున్నట్టు బుల్లిబాబు తెలిపారు. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సహకారంతో పార్కును అభివృద్ధి పరచి సుందరీకరిస్తామన్నట్టు పేర్కొన్నారు. సమీప వ్యవస్థ ఉన్నందున స్థానిక ప్రజలు సేద తీరేందుకు ఈ పార్కును నిర్మించారన్నారు. పంచాయతీ ప్రధాన రహదారి విస్తరణలో కొంత పోయిందన్నారు. ఈ నేపథ్యంలో పాల కేంద్రం పక్కనున్న ఖాళీ స్థలంలో పార్కును పునరుద్ధరించి, అన్ని విధాలా అభివృద్ధి చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమాల్లో పంచాయతీ కార్యదర్శి ఎన్.రమేష్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మంత్రి పీటర్ వైజ్‌మెన్ తదితరులు పాల్గొన్నారు.

నూకాంబిను దర్శించుకున్న రత్నాకర్



అమ్మవారిని దర్శించుకుంటున్న రత్నాకర్

అనకాపల్లి: పట్టణంలో గవరపాలెం నూకాంబిక అమ్మవారిని వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్ శుక్రవారం దర్శించుకున్నారు. కొత్త అమ్మవారి ఆలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన దాడి రత్నాకర్‌కు ఆలయ అర్చకులు సంప్రదాయ రీతిలో స్వాగతం పలికి, దగ్గరుండి మరీ అమ్మవారి దర్శనం చేయించారు. అంతకు ముందు రత్నాకర్‌ను కాలువతో సత్కరించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఉన్నారు.

పాఠశాల పరిశీలన: నాడు–నేడు పథకంలో పాఠశాలలను అభివృద్ధి చేసి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆశయం నెరవేర్చాలని వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ అన్నారు. శుక్రవారం ఆయన సత్యనారాయణపురం ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. ప్రభుత్వం మంజూరు చేసిన ఫర్నిచర్ అది బయట వరండాలో ఉందని, వెంటనే అందుబాటులోకి తేవాలని చెప్పారు. వంటశాల నిర్మాణాన్ని త్వరగా పూర్తిచేయాలన్నారు. అనంతరం ఉడ్‌పేట పాఠశాల ఆవరణలోని విద్యాశాఖ కార్యాలయంలో ఎంఈవో చిట్టిబాబును కలిసి సత్యనారాయణపురం పాఠశాల భవన నిర్మాణ పనులను చేపట్టి విద్యార్థుల చదువుకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని కోరారు.

ఘనంగా వైష్ణవ కృష్ణాష్టమి వేడుకలు



ట్రాక్టర్‌పై ఊరేగిస్తున్న శ్రీకృష్ణుని విగ్రహం



ఉత్సవంలో ఆకట్టుకున్న బిండెల డ్యాన్స్

కశింకోట:దేవదాయ ధర్మదాయ శాఖకు చెందిన స్థానిక దక్షిణ, సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న వైష్ణవ కృష్ణాష్టమి రెండో రోజు వేడుకల్లో భాగంగా శుక్రవారం రాత్రి ఉట్టి సంబరం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణుని ఉత్సవ విగ్రహాన్ని పల్లకిలో ఉంచి, మేళ తాళాల మధ్య గ్రామంలో ఊరేగించారు. పలుచోట్ల స్థానికులు ఏర్పాటు చేసిన ఉట్లను సంప్రదాయంగా మొల్లి సత్యారావు కొట్టారు. యువకులు ఉత్సాహంగా పాల్గొని ఉట్టి కొట్టేటపుడు రంగునీళ్లు చల్లి ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రేజేటి శ్రీరామాచార్యులు, అర్చకులు రేజేటి సీతారామాచార్యులు, మారుతి తదితరులు పాల్గొన్నారు.

- గురువారం రాత్రి పంచాక్షరపేట యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కృష్ణుని విగ్రహాన్ని ట్రాక్టర్‌పై ఊరేగించారు. రోజూ సాయంత్రం పూట ప్రవర్చన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బిండెల డ్యాన్స్ ఆహూతులను ఆకట్టుకుంది. ఉత్సవం సందర్భంగా గోవిందరావుకాలనీ, పునర్ల వీధి తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఉట్టిలు కొట్టేందుకు యువకులు ఉత్సాహంగా పోటీపడ్డారు.

నేటి నుంచి భగవద్గీత ప్రవచనాలు

కశింకోట: స్థానిక గవరపేటలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం నుంచి భగవద్గీత ప్రవచనాల కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. రోజూ సాయంత్రం పూట ప్రవచన కార్యక్రమం కొనసాగుతుందన్నారు. భగవద్గీత ప్రాధాన్యత, నిత్య జీవితంలో దాని ఉపయోగం తదితర అంశాలను ప్రముఖులు వివరిస్తారని తెలిపారు. భక్తులు హాజరు కావాల్సిందిగా కోరారు.

ప్రశాంతంగా పాలిటెక్నిక్ కౌన్సెలింగ్

కశింకోట: స్థానిక ఆర్‌ఈసీఎస్‌లో రాజీవ్‌గాంధీ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశానికి శుక్రవారం నిర్వహించిన కౌన్సెలింగ్ ప్రశాంతంగా ముగిసింది. 61 మంది విద్యార్థులు కళాశాలలో చేరారు. స్థానిక కళాశాలలో ఈఈఈ, ఈసీఈ, మెకానికల్, సివిల్ బ్రాంచ్‌లో డిప్లమో విద్యార్థులు, ఉద్యోగుల పిల్లల కోటా కింద 50 శాతం సీట్ల భర్తీకి పాలిసెట్ ర్యాంకుల ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహించారు. సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ నియమించిన ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఐవీఎస్ శ్రీనివాసరావు పర్యవేక్షణలో విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించి, సీట్లు కేటాయించారు. ఇంకా 59 సీట్లు భర్తీ కాకుండా ఖాళీగా మిగిలాయి. ఈసీఈలో మాత్రమే సీట్లు పూర్తి స్థాయిలో భర్తీ అయ్యాయి. మిగిలిన మూడు బ్రాంచ్‌ల్లో సీట్లు ఖాళీ ఉన్నట్టు కళాశాల యాజమాన్యం తెలిపింది. కౌన్సెలింగ్ ప్రక్రియలో ప్రిన్సిపాల్ కె.శివ, కళాశాల జనరల్ హెడ్ ఎస్.గణేష్, సూపరింటెండెంట్ కె.శివరాం, బి.జగన్మోహిని తదితరులు పాల్గొన్నారు.



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఐవీఎస్ శ్రీనివాసరావు

ఎస్‌హెచ్‌జీ మహిళల ఔదార్యం

కశింకోట: దీర్ఘకాలిక అనారోగ్యంతో బాధపడుతున్న మహిళా సమాఖ్య కార్యదర్శిని ఆదుకునేందుకు స్వయం సహాయక సంఘాల మహిళలు ముందుకు రావడం అభినందనీయమని ఎంపీపీ కలగా లక్ష్మి అన్నారు. కశింకోటలో శుక్రవారం మండల మహిళా సమాఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమాఖ్య కార్యదర్శిగా పని చేసి కిడ్నీల డ్యామేజీ, అనారోగ్యంతో బాధపడుతున్న తోటాడ లక్ష్మికి స్వయం సహాయక సంఘాల మహిళలు రూ.76 వేలు విరాళంగా సమకూర్చారు. ఈ విరాళాన్ని ఎంపీపీ చేతుల మీదుగా బాధితురాలికి అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కొండ్రపు అరుణ, కోశాధికారి అప్పలనరసమ్మ, ఏపీఎం ఎ.శ్రీనివాసరావు, సీసీలు, స్వయం సహాయక సంఘాల ఓబీలు హాజరయ్యారు.



తోటాడ లక్ష్మికి విరాళం సొమ్ము అందిస్తున్న ఎంపీపీ కలగా లక్ష్మి

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

తుమ్మపాల: సీజనల్ వ్యాధుల నివారణకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ, ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని జీవీఎంసీ జోనల్ కమిషనర్ పి.వెంకటరమణ అన్నారు. పట్టణంలోని 83వ వార్డు భీమునిగుమ్మం అంబేడ్కర్‌నగర్‌లో డ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా వంటి విషజ్వరాలు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరిసరాల్లో నిల్వ ఉన్న నీటి ద్వారా దోమల వృద్ధి చెందుతాయని, ప్రతి శుక్రవారం నీటి నిల్వ పాత్రలు పూర్తిగా ఆరబెట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంఓహెచ్ రజని, శానిటరీ అధికారులు ఎస్ఎస్ రవికుమార్, అప్పారావు, మలేరియా అధికారి గణేష్, సచివాలయ అధికారులు పాల్గొన్నారు.



డ్రైడేపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న జెడ్సీ వెంకటరమణ

బావిలో పడిన శునకాన్ని రక్షించిన అగ్నిమాపక సిబ్బంది

అనకాపల్లిటౌన్‌: పట్టణంలోని గవరపాలెం అంబేడ్కర్‌నగర్‌లో 15 అడుగుల లోతున్న బావిలో శుక్రవారం ఓ శునకం ప్రమాదవశాత్తూ జారి పడింది. దీన్ని గుర్తించిన స్థానిక అగ్నిమాపక సిబ్బంది బావిలోకి దిగి శునకాన్ని ప్రాణాలతో బయటకు తీశారు. బావి నుంచి బయటపడడమే తరువాయి, తన ప్రాణాలు దక్కాయన్న ఆనందంతో శునకం పరుగులు తీసింది. అగ్నిమాపక సిబ్బంది చొరవను స్థానికులతోపాటు, 80వ వార్డు కార్పొరేటర్ కొణతాల భాస్కర్ అభినందించారు.



బావిలో నుంచి శునకాన్ని తీసే ప్రయత్నంలో అగ్నిమాపక సిబ్బంది

ఘనంగా కనకదుర్గమ్మకు శ్రావణ పూజలు

అనకాపల్లిటౌన్‌: శ్రావణమాసం ఉత్సవాల్లో భాగంగా మండలంలోని సత్యనారాయణపురం పంచాయతీ కబ్బాలగిరిపై వెలసిన శ్రీ కనకదుర్గ అమ్మవారిని వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ శుక్రవారం దర్శించుకుని, పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు రేజేటి దుర్గాప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి, అమ్మవారి ప్రసాదాన్ని అందించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మేడిశెట్టి సత్తిబాబు, ఆలయ అధ్యక్షుడు యల్లపు త్రినాథ్, కార్యదర్శి బోయిన రమణాజీ, వైఎస్సార్‌సీపీ నాయకులు శిలపరశెట్టి బాబి, బోడపాటి చిన్న రాజారావు, దొడ్డి రమణ, రమణబాబు, రేబాక ఇంద్రకుమార్, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సత్యనారాయణపురం కనకదుర్గమ్మ సన్నిధిలో దాడి రత్నాకర్

అనారోగ్యంతో చోడవరం ఏఎస్‌ఐ మృతి

చోడవరం రూరల్: కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న చోడవరం ఏఎస్సై జి.వి.వి.రమణ శుక్రవారం ఉదయం మృతి చెందారు. ఆయన తన స్వగ్రామం అనకాపల్లి మండలం సాలాపువానిపాలెంలో తుది శ్వాస విడిచారు. పోలీసు గౌరవ వందనంతో ఆయన భౌతిక దేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. చోడవరం సీఐ బి.శ్రీనివాసరావు, సిబ్బంది హాజరై తమ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో రమణ సేవలను గుర్తు చేసుకున్నారు.





పోలీస్ గౌరవ వందనంతో అంత్యక్రియలు (ఇన్‌సెట్) మృతుడు ఏఎస్‌ఐ రమణ

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

సబ్బవరం: సబ్బవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ వృత్తి విద్యా కోర్సులకు అతిథి అధ్యాపకులుగా పనిచేయడానికి అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ పి.మనోహర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హతకు ధ్రువపత్రాలతో పాటు దరఖాస్తులను ఈ నెల 16 లోగా కళాశాలలో అందజేయాలన్నారు. జీఎఫ్‌సీ అధ్యాపక పోస్టుకు ఎంఎ ఎకనామిక్స్‌లో, సీఎస్ఈ పోస్టుకు బీటెక్/ఎంసీఏ, కంప్యూటర్ సైన్స్‌లో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. పీఈఏఏటెక్(ఓటీ) ఒకేషన్ అధ్యాపక పోస్టుకు బీపీటీ/ఎంపీటీ లో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలని పేర్కొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

సబ్బవరం:సైబర్ నేరాలు అధికమవుతున్న తరుణంలో విద్యార్థులంతా అప్రమత్తంగా వ్యవహరిస్తూ మరింత మందికి అవగాహన కల్పించాలని సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. సీతాలక్ష్మి అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన డిజిటల్ డిగ్నిటీ డేలో ఆమె ప్రసంగించారు. ప్రతి శుక్రవారం ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలిపారు. మహిళలు,బాలికలు దిశ యాప్ వినియోగంపై అవగాహన కలిగి ఉండాలన్నారు.అక్షరాస్యత దినోత్సవాన్ని పురస్కరించుకుని సామాజికాభివృద్ధికి అక్షరాస్యత ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు బి. ఎల్.ఎన్.పి రామకృష్ణ, డాక్టర్ గోపాల కృష్ణ, డాక్టర్ ఎల్. గణేష్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి